క్లుప్తంగా

గరిడేపల్లిలో సీపీఎం జనచైతన్య యాత్ర



రాయినిగూడెంలో జనచైతన్య యాత్రకు స్వాగతం పలుకుతున్న మండల నాయకులు

గరిడేపల్లి: సీపీఎం జన చైతన్యయాత్ర ఆదివారం గరిడేపల్లి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా రాయినిగూడెం వద్ద సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర బృందానికి స్వాగతం పలికారు. అనంతరం ఈ యాత్ర కీతవారిగూడెం, అప్పన్నపేట గ్రామాలకు చేరుకుంది. అక్కడి నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి కొలిపాక వంశీకృష్ణ, నాయకులు తుమ్మల సైదయ్య, వలి, భిక్షం, సోమయ్య, వెంకటేశ్వర్లు, జుట్టుకొండ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుధాకర్, నాగయ్య, అంజయ్య, యాగిరి, జానీ, వెంకన్న, సైదులు, అరవింద్, మట్టయ్య తదితరులున్నారు.

గ్రంథాలయం పరిశీలన



గ్రంథాలయంలో పాఠకుల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ శిరీష

కోదాడఅర్బన్: కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ శాఖ గ్రంథాలయాన్ని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని గదులు, పెచ్చులూడుతున్న పై కప్పు, రీడింగ్ రూం పరిశీలించారు. పాఠకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, దొంగరి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కంఠమహేశ్వర ఆలయ నిర్మాణం అభినందనీయం

కోదాడరూరల్: గౌడ కులస్తులు ఐక్యంగా ఉండి కులదైవమైన కంఠమహేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని కంఠమహేశ్వరస్వామి దేవాలయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారగాని శంకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలోని ఎర్రవరంలో నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. రూ.1.50లక్షల విలువైన విగ్రహాలను విరాళంగా అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు బెల్లంకొండ నాగయ్య గౌడ్ ఉన్నారు.

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న పోకల వెంకటేశ్వర్లు

గరిడేపల్లి: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం గరిడేపల్లి మండలంలోని గానుగుబండ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ పార్టీ నాయకులు కడియాల అప్పయ్య, జొన్నలగడ్డ తిరుపతయ్య, ఆంజనేయులు, వలిసాహెబ్, బొమ్మకంటి సోమయ్య, సీరాసాహెబ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

నడిగూడెం: టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ కోదాడ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఓరుగంటి ప్రభాకర్ కోరారు. ఆదివారం నడిగూడెం మండల పరిధిలోని తెల్లబల్లిలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు గుండు నాగేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు లింగయ్య, నాయకులు కొల్లు రామారావు, చిలుకూరు మండల కన్వీనర్ సాతులూరి గుర్వయ్య, చిలుకూరు వైస్‌ఎంపీపీ జనపనేని జానకి పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు

మేళ్లచెరువు: మండలంలోని రామాపురం పరిధిలోని రెయిన్ సిమెంట్ పరిశ్రమలో నిర్వహిస్తున్న జాతీయ భద్రతా వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జీఎం గురప్ప, వెంకటేశ్వర్లు, చక్రధర్, పరిశ్రమ భద్రత అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలే..



కంకర తేలిన బీక్యతండా రోడ్డు



గుంతలమయమైన రహదారి

- కంకర తేలి ప్రమాదకరంగా మారిన మోతె మండలంలోని రహదారులు
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మోతె: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన బీటీ, మెటల్ రోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళలో ప్రయాణించే వాహనదారులు ఎక్కడ ఏ గుంత ఉందోనని భయాందోళన చెందుతున్నారు. రోడ్ల దుస్థితిపై మండల ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు ఎంత మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

పూర్తిగా ధ్వంసమైన రోడ్లు..

మండల కేంద్రం నుంచి బీక్యతండాకు వెళ్లే మెటల్ రోడ్డు కంకర తేలింది. విభళాపురం గ్రామం నుంచి ఉర్లుగొండ, రావికుంటతండా, కూడలి గ్రామానికి వెళ్లే సర్వీస్ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రావిపహాడ్ అడ్డరోడ్డు నుంచి సర్వారం వెళ్లే మెటల్ రోడ్డుపై ప్రమాదకరమైన గంతలు ఏర్పడ్డాయి. అదేవిధంగా హుస్సేన్‌బాద్ గ్రామం నుంచి గోతండాకు వెళ్లే బీటీ రోడ్డు, సర్వారం నుంచి రాదాస్‌తండా, ఉర్లుగొండ వెళ్లే రోడ్డు ధ్వంసమైంది.

నాణ్యత పాటించకపోవడం వల్లే..

రోడ్లు నిర్మించే క్రమంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే రోడ్లు త్వరగా ధ్వంసమవుతున్నాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్లు నిర్మించే సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షణ కరువైందని, దీంతో రోడ్డు నిర్మించిన రెండు, మూడు సంవత్సరాలలోపే ధ్వంసమవుతున్నాయని పేర్కొంటున్నారు. దీనికి తోడు ఈ మార్గాల్లో భారీ వాహనాలు రాకపోకలు సాగించడం, పాలేరు వాగు నుంచి ఇసుక తరలించే ట్రాక్టర్లు నిత్యం వెళ్తుండడంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని, మట్టి, మెటల్ రోడ్లను బీటీగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలు పూడ్చాలి



హుస్సేన్‌బాద్ గ్రామం నుంచి బుర్కచర్ల, రావిపహాడ్, సర్వారం గ్రామాల రోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. రాత్రి వేళలో ఈ మార్గాల గుండా రాకపోకలు సాగించలేని పరిస్థితి. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలి.

– కోట మధుసూదన్‌రెడ్డి, రావిపహాడ్

బీటీ రోడ్డుగా మార్చాలి

మండల కేంద్రం నుంచి బీక్యతండాకు వెళ్లే మెటల్ రోడ్డును బీటీగా మార్చాలి. తండా నుంచి మోతె హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో కంపచెట్లు కమ్ముకున్నాయి. వాహనదారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ చూపి బీక్యతండా నుంచి మోతెకు బీటీ సౌకర్యం కల్పించాలి.

– బానోతు చాంప్లా, బీక్యతండా

అధికారులకు ప్రతిపాదనలు పంపించాం

మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై ఇప్పటికే అధికారులకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే గుంతలు పడిన రహదారులకు మరమ్మతులు చేయిస్తాం.

– రంగారావు, పీఆర్ ఏఈ, మోతె

తల్లిదండ్రులకు విద్యార్థుల పాదపూజ



గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

చిలుకూరు: మండలంలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం, తల్లిదండ్రులకు పాద పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, సర్పంచ్ కొడారు బాబు, మాజీ జెడ్పీటీసీ బట్టు శివాజీ నాయక్, సొసైటీ చైర్మన్ జనార్దన్, ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జ్ఞానసాయి మందిర వార్షికోత్సవం



ప్రవచిస్తున్న శ్రీరామదూత స్వామి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో ఆదివారం జ్ఞానసాయి మందిర వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవేణుదత్త సువర్ణలక్ష్మీ దాంపత్య వ్రతం, మహాయాగం, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శ్రీ రామదూత స్వామి ప్రవచిస్తూ ప్రతిఒక్కరూ ఈర్ష, అసూయ, ద్వేషం, కోపం, దుఃఖం తొలగించుకుంటే దైవత్వం ప్రవేశిస్తుందని తెలిపారు. తాము సన్మార్గంలో నడుస్తూ అందరికీ మేలు చేయాలని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి దంపతులు, కోదాడ మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెదనాటి సరితకు నివాళి



సరిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని దోరకుంటలో ఆదివారం పెదనాటి సరిత వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకు ముందు బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో పెదనాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు, ఏర్నేని బాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, సామినేని ప్రమీలరమేష్, ఏటుకూరి రామారావు, సీతరామయ్య, భరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



కోదాడరూరల్: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



చిలుకూరులో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడరూరల్: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అన్నెం పాపిరెడ్డి, కొప్పుల లక్ష్మారెడ్డి, అన్నెం నరసింహారెడ్డి, చిన్న వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, పాపిరెడ్డి, శంకర్, కోటయ్య తదితరులున్నారు.

చిలుకూరు: ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసినందుకు నిరసనగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చిలుకూరు మండల కేంద్రంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు, కార్యదర్శి హనుమంతరావు, నాయకులు కొల్లు నాగయ్య, మండవ మధు, విజయభాస్కర్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి ధర్మభిక్షం కృషి



హుజూర్‌నగర్: ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



చిలుకూరు: సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు మాజీ ఎంపీ ధర్మభిక్షం అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ధర్మభిక్షం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాలకూరి బాబు, దేవరం మల్లీశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ, నాయకులు యల్లావుల రమేష్, మామిడి వెంకయ్య, ఇందిరాల వెంకటేశ్వర్లు, జడ వెంకన్న, జక్కుల శ్రీను, జక్కుల రమేష్, కుమ్మరి కుంట్ల నాగేశ్వరరావు, మామిడి నరసయ్య, బత్తిని మల్లయ్య, బంటు శ్రీను, మన్యం గురుస్వామి పాల్గొన్నారు.

ధర్మభిక్షం చిత్రపటానికి నివాళి

చిలుకూరు: మండలంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం మాజీ ఎంపీ, గీత పనివారల సంఘం జాతీయ అధ్యక్షుడు బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతిని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య, నాయకులు కట్టికోల నాగేశ్వరరావు, మౌలానా, కొడారు రవి, జానీ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసీతారాముల కల్యాణానికి తలంబ్రాల అందజేత



శ్రీరామ నామ లిఖించిన తలంబ్రాలు అందజేస్తున్న చలువాది విష్ణువందన

నేరేడుచర్ల: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా నేరేడుచర్లలోని శ్రీ అయోధ్య కోదండ రామాలయానికి శ్రీరామ నామ లిఖిత తలంబ్రాలను హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన చలువాది మల్లివిష్ణువందన ఆదివారం ఆలయ ధర్మకర్త పాల్వాయి రమేష్, అనిత దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రాద్రి ఆలయంలో నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి రామ నామం లిఖించిన 1,01,116 బియ్యపు గింజలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఇరుగంటి శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

నేరేడుచర్ల: మండలంలోని కందులవారిగూడెంలో ఉన్న కోదండ రామస్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అన్నంబొట్ల ప్రణయ్‌కుమార్‌శర్మ, వేద పండితులు అన్నంబొట్ల ఫణికుమార్‌శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బైరెడ్డి బక్కిరెడ్డి, కమిటీ సభ్యులు ప్రదీప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

తుంగతుర్తి : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెలుగుపల్లిలో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధిహామీ నిధులు రూ.15లక్షలతో గ్రామంలో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి వెంకన్న, ఎంపీటీసీ కవిత, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములుగౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



దూదియాతండాలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

చిలుకూరు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం చిలుకూరు మండలంలోని దూదియాతండాలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు., అదే విధంగా రూ.20 లక్షలతో చేపట్టిన గ్రామ పంచాయతీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, సర్పంచ్ బాణోతు నందలాల్, సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, మాజీ జెడ్పీటీసీ బట్టు శివాజీ నాయక్, ఎంపీటీసీ కృష్ణ చైతన్య, నాయకులు వాసు, సక్రాం, నరేష్, రాములు, రామాచారి, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయి

నడిగూడెం: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందుతున్నాయని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం నడిగూడెం మండల పరిధిలోని వల్లాపురంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఆత్మీయ సమ్మేళనం జిల్లా ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్, ఎంపీపీ యాతాకుల జ్యోతి, జెడ్పీటీసీ బాణాల కవిత, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కాసాని వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, వల్లాపురం సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, నాయకులు దేవబత్తిని సురేష్ ప్రసాద్, పుట్టా రమేష్, నూకపంగు ఈదయ్య, అనంతుల ఆంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు కేసీ గుప్తా



కోదాడలో ఏర్పాటు చేసిన కేసీ గుప్తా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లం

కోదాడఅర్బన్: నాటి నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా అని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో కోదాడ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుప్తా విగ్రహాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంపటి పద్మ, వాసవీక్లబ్ నల్లగొండ జిల్లా గవర్నర్ వంగవీటి వెంకటగురుమూర్తి, ఎమ్మెస్ విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి, వాసవీక్లబ్ కోదాడ అధ్యక్ష, కార్యదర్శులు ఇమ్మడి సతీష్‌బాబు, ఎస్ఎస్‌రావు, ఇంకా వెంపటి ప్రసాద్, నీలా సత్యనారాయణ, రాయపూడి వెంకటనారాయణ, పి నారాయణరావు, పి సత్యనారాయణ, జి ప్రసాద్, సీహెచ్ విజయశేఖర్, లక్ష్మీనర్సయ్య, జి శ్రీనివాసరావు, సతీష్, బండారు శ్రీనివాసరావు, పబ్బా గీత, రమాదేవి, మాధవి, హైమవతి, బాబు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

మునగాల: మండల కేంద్రంలోని ప్రజ్ఞా పాఠశాలలో ఆదివారం నిర్వహించిన శ్రీమురళీకృష్ణ యాదవ సంఘం విస్తృతస్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా గడ్డం వెంకటేశ్వర్లు యాదవ్, కార్యదర్శిగా జంగిలి గోపి యాదవ్, కోశాధికారిగా గడ్డం అజయ్ యాదవ్, జాయింట్ సెక్రటరీగా గడ్డం వినోద్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. అదే విధంగా గంగమ్మ ఆలయ నిర్మాణ కమిటీ నూతన కమిటీ అధ్యక్షుడిగా గడ్డం వెంకన్న యాదవ్, కార్యదర్శిగా దాసరి గోపి యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా లింగయ్య యాదవ్, గౌరవ సలహాదారుడిగా దాసరి వెంకటేశ్వర్లు యాదవ్, కమిటీ సభ్యులుగా ముంత కృష్ణయ్య యాదవ్, నలమాద వెంకటేష్ యాదవ్, గడ్డం విజయ్ యాదవ్, వేల్పుల కృష్ణ యాదవ్, బొలక మహేష్ యాదవ్, జక్కుల శేఖర్ యాదవ్, నాగార్జున యాదవ్, రాములును ఎన్నుకున్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా నాగార్జున

నేరేడుచర్ల: బీఎస్పీ మండల అధ్యక్షుడిగా నేరేడుచర్ల మండలం జానలదిన్న గ్రామానికి చెందిన తక్కెళ్ల నాగార్జునను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జిలకర రామస్వామి ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నడిగూడెం : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను ఆదివారం బీఎస్పీ రాష్ట్ర ఈసీ సభ్యుడు పిల్లుట్ల శ్రీను పరామర్శించారు. ఈ సందర్భంగా వినోద, ధనమ్మల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన వెంట భీమయ్య గౌడ్, తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరాలు ఆరోగ్య రక్షణకు దోహదం

కోదాడఅర్బన్: కోదాడ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, ఊపిరితిత్తులు, ఎముకలు, నరాల పరీక్షలు చేశారు. 190 మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కోదాడ పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి, రాంబాబు, కోదాడ యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సయ్య, సీనియర్ సిటిజన్ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, వెంకటేశ్వరరావు, విద్యాసాగర్‌రావు, భిక్షం, వైద్యుల డాక్టర్ శ్యామ్, కార్డియాలజిస్ట్ రాఘవేంద్రరావు, పలమనాలజిస్ట్ డాక్టర్ పుల్లారావు, ఈఎన్‌టీ డాక్టర్ భూషణ్, ఆర్థోపెడిక్ డాక్టర్ సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మేళ్లచెరువు: మండలంలోని వేపలమాధవరం గ్రామంలో ఆదివారం మైహోం సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ సోమనబోయిన సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొండల్‌రావు, పరిశ్రమ జీఎం నాగేశ్వరరావు, అడ్వైజర్ జగన్నాథరావు, మైన్స్ జీఎం శ్రీనివాసరావు, శ్రీధర్‌నాయక్, ఏజీఎం శ్రీనివాస్, రత్నం, శ్రీను, శ్రీహరి పాల్గొన్నారు.

బక్కమంతులగూడెంలో..

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడెంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన ల్యాండ్ స్పేస్ ఫౌండేషన్, టీఎక్స్ హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎంపీపీ పార్వతి కొండానాయక్, సర్పంచ్‌లు మన్నెం శ్రీనివాసరెడ్డి, బేత విజయకుమారి వెంకటరెడ్డి ప్రారంభించారు. వైద్యులు గ్రామస్తులకు పలు రకాల వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ దయానంద్ వైద్యబృందాన్ని సత్కరించి, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తేల లచ్చిరెడ్డి, ఎంపీడీఓ జానకిరాములు, మాజీ ఎంపీపీ మామిడిసోమమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

కోదాడరూరల్: మండల పరిధిలోని గణపవరం సన్నీ ఉన్నత పాఠశాలలో 1999– 2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.